క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శెంకేశి మల్లికార్జున్ తెలిపారు. నక్కలపల్లి, రాంగోపాల్‌పూర్, నక్కలపల్లి ఇండస్ట్రీయల్ ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీకి రూ.19.80 కోట్ల ఆదాయం

హన్మకొండ: దసరా పండుగ.. ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని సమకూర్చింది. తెలంగాణలో అతి పెద్ద పండుగలు సద్దుల బతుకమ్మ, దసరాకు వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా తమ సొంతూళ్లకు వచ్చి వెళ్తారు. ఈ అవకాశాన్ని టీఎస్ ఆర్టీసీ సద్వినియోగం చేసుకుంది. డిమాండ్ ఉన్న ప్రధాన రూట్లలో అదనపు బస్ సర్వీస్‌లు ఏర్పాటు చేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసింది. ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు అదనంగా ప్రత్యేక బస్ సర్వీస్‌లు నడిపింది. వరంగల్ రీజియన్‌లో 13 రోజుల్లో 45.31 లక్షల కిలో మీటర్లు బస్ సర్వీస్‌లు నడిపి రూ.19.80 కోట్ల ఆదాయం రాబట్టుకుంది.

నేడు సీబీసీలో ఎన్నికలు

కాశిబుగ్గ: వరంగల్ క్రిస్టియన్ కాలనీ సెంటినరీ బాప్టిస్టు చర్చి (సీబీసీ)లో శుక్రవారం నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నికలు జరగనున్నాయి. కొన్ని రోజులుగా జనరల్ ఎన్నికలను తలపిస్తూ పోటీలో ఉన్న అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. పోలింగ్ శుక్రవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగనుంది. శనివారం ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2,121 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిసింది. చర్చి పాలకవర్గ ఎన్నికల్లో మూడు ప్యానళ్లు, కొంత మంది ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికలో గెలుపొందిన వారు రెండేళ్లపాటు చర్చి పాలకవర్గ సభ్యులుగా కొనసాగుతారు.

కొనసాగుతున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన



ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని రుద్రమాంబనగర్‌లో గురువారం రెండోరోజు బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగింది. ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేద పండితుడు పోలాజు భాస్కరాచార్యులు నేతృత్వంలో బొడ్రాయి మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీభూలక్ష్మి, శ్రీలక్ష్మి విగ్రహాలకు జలాధివాసం జరిపించారు. ఉదయం 8గంటలకు హోమం, గణాధిపతి పూజ, పరుణాయనం, పంచామృత, నవనీత, సుంగధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం 6గంటలకు కుంకుమ పూజ చేశారు.

జూడో విజేతలకు అభినందన



వరంగల్/కాశిబుగ్గ/కాజీపేట అర్బన్: ఈనెల 17నుంచి 19వ తేదీ వరకు చెన్నైలో జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ జూడో టోర్నమెంట్‌లో వరంగల్ ఖేలో ఇండియా జూడో సెంటర్‌కు చెందిన క్రీడాకారులు యశ్విత్‌రాజు, జతిన్, విఘ్నేష్ పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈమేరకు డీవైఎస్ఓ సత్యవాణి ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యను క్రీడాకారులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలని సూచించారు. కలెక్టర్ ప్రావీణ్యను కలిసిన వారిలో కోచ్ లింగమూర్తి ఉన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



హన్మకొండ: సుమారు నెల రోజుల నుంచి నల్లా నీరు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం 8వ డివిజన్ పరిధి కుమార్‌పల్లిలోని మంగళివాడలో మహిళలు రోడ్డుపై ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. వారికి స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మికుమారి మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి వ్యథ గురించి నెల రోజులకు పైగా మున్సిపల్ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సద్దుల బతుకమ్మ నాడు సైతం నీళ్లు వదలకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రతిపక్ష కార్పొరేటర్ల పట్ల మున్సిపల్ అధికారులు పక్షపాతం చూపెడుతూ అధికార పార్టీకి అనుచరులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమస్యను పరిష్కరించకపోతే స్థానిక ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైరి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను అభివృద్ధి చేయండి

కాజీపేట: కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ నుంచి ఫాతిమానగర్ మీదుగా నిట్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీగా ఉన్న స్థలాల్లో దుకాణాలు నిర్మిస్తే హాకర్ల సమస్య తీరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పట్టణంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను కూడా అధిగమించవచ్చని సూచిస్తున్నారు. కార్పొరేషన్ అధికారుల అవినీతి, పట్టింపు లేనితనం వల్ల రోడ్ల పక్కనున్న ఖాళీ స్థలాలను అంగబలం, అర్థ బలం ఉన్న నాయకులు ఆక్రమించుకుని చిరు వ్యాపారులకు అమ్ముకోవడం లేదా అద్దెలకు ఇచ్చుకోవమో చేస్తున్నారు. అయినా పట్టించుకునేవారు కానరావడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కబ్జాకు గురవుతున్న ఖాళీ స్థలాలు

కాజీపేట శివారు నుంచి నిట్ వరకు ఉన్న ప్రభుత్వ స్థలాలు క్రమేణా ఆక్రమణకు గురవుతూ కొబ్బరి బోండాలు, పండ్ల వ్యాపారాలు, హోటళ్లు, టీస్టాళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక్కడ బలం ఉన్నోడిదే రాజ్యం అన్నచందంగా మారింది. అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. రోడ్లపైనే విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా పట్టించుకునే వారు లేకుండాపోయారు. మున్సిపల్ అధికారులతోపాటు ట్రాఫిక్ పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వారిని పట్టించుకోవడం లేదు.

దుకాణాలు నిర్మిస్తే ఆదాయం

కాజీపేట పట్టణంలో రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ స్థలాల్లో హాకర్లు ఇష్టారాజ్యంగా దుకాణాలు నిర్మించుకోవడంతో తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అధికారులు ఒక్క



రైల్వే క్వార్టర్స్ ఎదురుగా ఖాళీగా ఉన్న స్థలం

అడుగు ముందుకేసి ఖాళీ స్థలాల్లో దుకాణాలు నిర్మిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు నగర కార్పొరేషన్‌కు ఏటా రూ.5లక్షలకు పైగా ఆదాయం వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ స్థలాలు పూర్తిగా ఆక్రమణలకు గురికాక ముందే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సర్వమత సౌభ్రాతృత్వం బీఆర్ఎస్ విధానం

హన్మకొండ: సర్వమత సౌభ్రాతృత్వం బీఆర్ఎస్ ప్రభుత్వ విధానమని, మతం ప్రేమ పంచాలే తప్ప, విద్వేషాలను పెంచకూడదని ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో గురువారం నిర్వహించిన దసరా మిలాన్, సర్వమత సమ్మేళనంలో వినయ్‌భాస్కర్ మాట్లాడారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని వివరించారు. ఏ మత గ్రంథమూ విద్వేషాలను రగిలించాలని చెప్పలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బాలుడిని ఓదార్చిన చీఫ్ విప్

హనుమకొండ హంటర్ రోడ్డులో గురువారం ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాలుడికి గాయాలయ్యాయి. అదే దారిలో వెళ్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్.. వెంటనే అక్కడికి వెళ్లి కిందపడిన బాలుడిని పైకి లేపి ఓదార్చారు. అనంతరం ఆస్పత్రికి పంపించారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న చీఫ్ విప్

కేసీఆర్ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నియోజకవర్గం హనుమకొండలోని జులైవాడ, పోస్టల్ కాలనీ, నాగేంద్రనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంచుతూ గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు నెక్కొండ కవిత, ఏనుగుల మానస, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌లో రేషన్‌షాపు కేటాయింపు..?

వరంగల్: గ్రేటర్ వరంగల్ 26వ డివిజన్ గిర్మాజీపేట రామవారి వీధిలో ఖాళీగా ఉన్న రేషన్‌షాపు డీలర్‌షిప్‌ను కరీమాబాద్‌కు చెందిన కిరోసిన్ హాకర్‌కు శాశ్వతంగా కేటాయిస్తూ వరంగల్ ఆర్‌డీఓ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. వరంగల్ మండల రెవెన్యూ కార్యాలయం పరిధిలో పలు కారణాలతో 24 రేషన్‌షాపు డీలర్‌షిప్‌లు ఖాళీగా ఉన్నాయి. డీలర్‌షిప్‌లేని షాపులను పక్కనే ఉన్న మరో డీలర్‌కు కేటాయించి రేషన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. కొత్త డీలర్‌షిప్‌లను కేటాయించాలంటే నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన వారికి అందజేయాల్సి ఉంటుంది. కానీ ఎన్నికల కోడ్ అమలవుతున్న ఈ సమయంలో రేషన్‌షాపును రామావారి వీధిలోని రేషన్‌షాపును కిరోసిన్ హాకర్‌కు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీలర్‌షిప్ పొందేందుకు కావాల్సిన అర్హతలు లేకున్నా కేటాయించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక పెద్దమొత్తంలో లావాదేవీలు జరిగినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మత్తు పదార్థాలను తరలిస్తే చర్యలు

ఖిలా వరంగల్: నిషేధిత గంజాయి, గుడుంబా, కల్తీ మద్యం వంటి పొగాకు, మత్తు పదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఖిలా వరంగల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కేసుల నమోదు చేసి జైలు, లక్ష జరిమానా విధించేలా సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. వరంగల్ పుప్పాలగుట్టలోని ఖిలా వరంగల్ ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలో ఖిలా వరంగల్, ఐనవోలు మండలాల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో విస్తృత తనిఖీలు చేపట్టి 48 కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 280 లీటర్ల గుడుంబా, 58 లీటర్ల మద్యం, 54 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వాటి విలువ సుమారు రూ.20 లక్షలని చెప్పారు. 164 మందిని సత్ప్రవర్తన కోసం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. సమాచారం, ఫిర్యాదులు కోసం 87126 59021 నంబర్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ కోరారు.

దోపిడీ విధానాలను ఎండగట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

వరంగల్ చౌరస్తా: అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని మోసం చేసేందుకు పాలక పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి దోపిడీ విధానాలను ఎండగట్టాలని కార్యకర్తలకు ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ సూచించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యూ) నగర ముఖ్య కార్యకర్తల సమావేశం ఎగ్గేని మల్లికార్జున్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉచిత సంక్షేమ పథకాల పేరు చెప్పి ఓట్లు, సీట్లు, అధికారం కోసం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఇదే అభివృద్ధి అంటూ చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల అసలు స్వరూపాన్ని ప్రజల్లో బట్టబయలు చేయాలని అన్నారు. బీఎల్ఎఫ్ బలపరిచిన అభ్యర్థి సుంచు జగదీశ్వర్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాబురావు, నగర కార్యదర్శి అభ్యర్థి సుంచు జగదీశ్వర్, బీఎల్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ ఐతం నాగేష్, జిల్లా కమిటీ సభ్యులు మాలి ప్రభాకర్, అప్పనపురి నరసయ్య, నగర నాయకులు పరిమళ గోవర్ధన్, రాజు, రాయినేని ఐలయ్య, నలివెల రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వరంగల్: వరంగల్ 21వ డివిజన్ ఎల్‌బీనగర్ మొయిన్‌పురలోని బూర రవీందర్ రేకుల ఇంటిలో గురువారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ అయింది. దాంతో ఇల్లు మొత్తం దగ్ధం అయిందని, సుమారు రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు వరంగల్ అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఎల్‌బీనగర్‌కు చెందిన బూర రవీందర్, అతని భార్య, కొడుకు ఉదయమే పనులకు వెళ్లగా మరో కొడుకు, కూతురు స్కూల్‌కు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. రవీందర్ ఇంటి నుంచి పొగలు రావడం, కొద్ది సేపటికే మంటలు ఎగసిపడుతుండడంతో చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చే లోపు ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. తూర్పు ఎమ్మెల్యే నరేందర్, కార్పొరేటర్ పుర్కాన్ అక్కడికి చేరకుని బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.



సిలిండర్ పేలడంతో ఎగసిపడుతున్న మంటలు

పోలీస్ స్టేషన్లే బీఆర్ఎస్ అడ్డాలు

ఖిలా వరంగల్: పోలీస్ స్టేషన్లు బీఆర్ఎస్ నేతలకు అడ్డాలు మారాయని, ప్రజా ప్రతినిధులు సంక్షేమాన్ని విస్మరించి భూ దందాలు, సెటిల్‌మెంట్లకే పరిమితమయ్యారని మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన సీపీఎం నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో సీపీఎం పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందన్నా నెపంతో గురువారం తెల్లవారుజామున వరంగల్ జక్కలొద్ది గుడిసెవాసుల నాయకులు, సీపీఎం నాయకులు మాలోతు సాగర్, ప్రత్యూష, ఓదెలును మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొండా సురేఖ.. గురువారం మధ్యాహ్నం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా ఆమెను ఓ ఎస్సై అడ్డుకున్నారు. దాంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో బైటాయించి నిరసన తెలిపారు. వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ మిల్స్ కాలనీ స్టేషన్‌కు చేరుకొని నచ్చజెప్పడంతో సురేఖ శాంతించారు. కార్యక్రమంలో మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, మంతిని సునీత, సీపీఎం నాయకురాలు నలిగంటి రత్నమాల పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కంకర మీద పడి వృద్ధుడి మృతి

కాశిబుగ్గ: బహిర్భూమి వెళ్లడానికి రైల్వే పట్టాలు దాటుతుండగా జారి కంకర మీద పడడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం ఉదయం వరంగల్– చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ధర్మారంలో జరిగింది. గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన వలిశెట్టి యాదగిరి(73) బహిర్భూమి వెళ్లడానికి సమీపంలోని రైలు పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో జారి ట్రాక్ పక్కన్న ఉన్న కంకర మీద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి భార్య వలిశెట్టి బుచ్చమ్మకు అప్పగించామని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు.

కాలువలో పడి ఒకరు..

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయపాల్ కాలనీలో నివాసముంటున్న హన్మకొండ సద్గురరావు (40) కాలువలో పడి మృతి చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. డ్రైవర్‌గా పనిచేసే సద్గురరావు మద్యానికి బానిసై మద్యం మత్తులో ఈనెల 24న రాత్రి విజయపాల్ కాలనీ దగ్గర కాలువలో పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

యువకుడి ఆత్మహత్య

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి న్యూశాయంపేటలోని సాయి గణేష్ రెసిడెన్సీలో కేతుపల్లి సాత్విక్ (25) తన రూములో క్రిమిసంహారక మందు ఆత్మహత్యకు పాల్పడినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. ఈనెల 25న పురుగుల మందు తాగగా, ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి అన్న సంజయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హసన్‌పర్తి: చింతగట్టు క్రాస్ భీమారం శివారులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గురువారం కనుగొన్నారు. ఆ ప్రాంతంలో ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడనే సమాచారం మేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. సదరు వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు. వివరాలకు 87726 85115, 87126 85089 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దూరవిద్య వెబ్‌సైట్‌లో ఫలితాలేవి?

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మొదటి, ద్వితీయ, ఫైనలియర్ పరీక్ష ఫలితాలను ఈ నెల 25న పరీక్షల విభాగం అధికారులు విడుదల చేశారు. సంబంధిత ఎస్‌డీఎల్‌సీఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. గురువారం ఆయా ఫలితాలు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదని పలువురు విద్యార్థులు అంటున్నారు. దీనిపై అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్‌ను వివరణ కోరగా సర్వర్ డౌన్‌తో ఫలితాలు కనిపించడం లేదని తెలిపారు.

జన్మదిన వేడుకల్లో తల్వార్లతో హల్‌చల్

ఖిలా వరంగల్: పోలీసు నిఘా ఉన్నా రహదారులపై యువకులు తల్వార్లతో హల్‌చల్ చేశారు. తల్వార్లతో కేక్ కట్ చేసి వినూత్న రీతిలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. దాన్ని చూసిన స్థానికులు బీతిల్లిపోయారు. ఈఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిల్స్‌కాలనీలోని శాలినగర్‌కు చెందిన ఓ యువకుడు, జాన్‌పాక కాలనీకి చెందిన మరో యువకుడు తల్వార్లతో బుధవారం వేడుకలు జరుపుకున్నారు. మద్యం మత్తులో కేకలు వేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇరువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వదిలేసినట్లు తెలిసింది.

సమస్యల పరిష్కారానికి కృషి

● టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (టీజీసీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అధ్యాపకులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో టీజీసీజీటీఏ కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రామకృష్ణారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డి.వెంకన్న, ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.రమేష్, బాధ్యులు డాక్టర్ అశోక్, డాక్టర్ ఇందిరానయనాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఫ్రీ కార్యాలయాలకు కృషి

హన్మకొండ: ప్లాస్టిక్ రహిత జిల్లా కార్యాలయాల సముదాయంగా హనుమకొండ ఐడీఓసీని నిలుపుదామని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. హనుమకొండ ఐడీఓసీలోని సమావేశ మందిరంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న సమావేశాల్లో వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్లను వరంగల్ మహానగర పాలక సంస్థ, ఐటీసీ వావ్, ఈ శ్రీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న పొడి వనరుల సేకరణ కేంద్రానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ కార్యాలయంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, వాటి స్థానంలో స్టీల్‌తో తయారు చేసిన పాత్రలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గణేష్, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీష్, సిబ్బంది సంపత్ కుమార్, ప్రవీణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ బాటిళ్ల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్

నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి



దరఖాస్తును పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ అర్బన్: టీఎస్ – బీపాస్‌లో భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకుని, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. బల్దియా పరిధిలోని కాజీపేట, భట్టుపల్లి, బాలసముద్రం, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో అనుమతుల జారీ నిమిత్తం రిజ్వాన్ బాషా గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాల అనుమతుల నేపథ్యంలో ప్లాన్ ప్రకారం డైమెన్షన్ స్పష్టంగా ఉండాలని, భవనాల పరిసరాలు (సైట్స్) పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో సిటీ ప్లానర్ వెంకన్న, టౌన్ ప్లానింగ్ అధికారులు బషీర్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన అవసరం అని వరంగల్ (తూర్పు)ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సెక్టార్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని సూచనలు చేశారు.

'కాసం ఫ్యాషన్' కారు విజేత కవిత

వరంగల్: వరంగల్ చౌరస్తా, పిన్నివారి వీధిలోని కాసం పుల్లయ్య వెడ్డింగ్ మాల్, కాసం పుల్లయ్య షాపింగ్ మాల్, కాసం పుల్లయ్య హోల్‌సేల్, బాంబే క్లాత్ స్టోర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఫ్యాషన్ పండుగ'లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన బంపర్ డ్రాలో కేపీఎస్/1023 – 080544 కూపన్ నంబర్ గల కవిత.. ఆల్టో కేవీడీ ఎల్ఎక్స్ఐ కారును గెలుచుకున్నారు. కాసం పుల్లయ్య సంస్థల నిర్వాహకులు కాసం మల్లికార్జున్ చేతుల మీదుగా కారును అందుకున్నారు. కార్యక్రమంలో కాసం నమఃశివాయ, కేదారినాథ్, శివప్రసాద్, ఫణీత్, సాయికృష్ణ, రాహుల్, శ్రవణ్‌కుమార్, సుమన్, అఖిల్, వినియోగదారులు నీతు, కవిత, షాపింగ్ మాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కారు విజేతను ప్రకటిస్తున్న వినియోగదారులు

'వర్ణం' బుల్లెట్ బండి విజేత అనిల్



కూపన్ నంబర్‌ను ప్రకటిస్తున్న కస్టమర్ సుచిత్ర

వరంగల్: వరంగల్ చౌరస్తాలోని వర్ణం (ఆలయం ఆఫ్ సిల్క్స్) షాపింగ్ మాల్ నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన బంపర్ డ్రాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350 బుల్లెట్ బండిని కేపీ4/1023–66646 కూపన్ నంబర్ గల వినియోగదారుడు అనిల్ గెలుచుకున్నాడు. ఈ డ్రాను కస్టమర్ల సమక్షంలో కస్టమర్ సుచిత్ర తీసిందని షాపింగ్‌మాల్ నిర్వాహకులు కాసం మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమంలో కాసం నమఃశివాయ, కేదారినాథ్, శివప్రసాద్, ఫనీత్, సాయికృష్ణ, సుమన్, రాహుల్, శ్రవణ్, అఖిల్, షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని వినతి

వరంగల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు అనుగుణంగా నరకాసుర వధ ఉత్సవాలు నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు గురువారం పుష్పగుచ్ఛం అందించారు. ఉత్సవ ఏర్పాట్ల కోసం వినతిపత్రం అందజేశారు. నరకా వధ ఉత్సవ కమిటీ సభ్యులు కనుకుంట్ల రవి, ఆవునూరి రామ్మూర్తి, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, మాటేటి శ్యాం, వంగరి సురేష్, అన్న కుమారస్వామి, దూడ కొమురెల్లి, కుడికాల సాంబశివరావు, తొటం నరసింహ, కొమ్ము రాజు ఉన్నారు.

మసీదు ప్రహరీకి రూ.2లక్షల విరాళం

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని మసీద్ ప్రహరీ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత ముందుకు వచ్చారు. ఈమేరకు గోడ నిర్మాణానికి రూ.రెండు లక్షలు విరాళంగా ప్రకటించారు. ప్రహరీ నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల రోడ్డు విస్తీర్ణం సందర్భంగా తొలగించిన ప్రహరీ నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, బీఆర్ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు సంగాల చిన్న పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెగడపల్లిలో కేంద్ర బలగాలు గురువారం కవాతు నిర్వహించాయి. సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, ఎస్సైలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

హసన్‌పర్తి: భట్టుపల్లిలో శుక్రవారం నిర్వహించనున్న వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఒకటవ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి ప్రజా ఆశీర్వాద సభకు రావాలని గురువారం ఆహ్వానించారు. నాయకులు సూర ప్రమోద్, శ్రీధర్, పాల్, రాణి, సాయిరెడ్డిపాల్గొన్నారు.

'జంగా'కే పశ్చిమ టికెట్ కేటాయించాలి

కాజీపేట: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేసే డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డికి వరంగల్ పశ్చిమ టికెట్ కేటాయించకుంటే కార్యాచరణకు సిద్ధమవుతామని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ హెచ్చరించారు. ఈమేరకు జంగాకు టికెట్ వచ్చేలా చూడాలని ఆకాంక్షిస్తూ కార్యకర్తలతో కలిసి కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.

యూసీసీఆర్ఐ అభ్యర్థులను గెలిపించాలి

హన్మకొండ: భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యూసీసీఆర్ఐ) ఎంఎల్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఇల్లందుల శోభన్‌బాబు కోరారు. తెలంగాణ శాసన సభకు జరగనున్న ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 40 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గెలుపునకు కృషి చేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నగర మాజీ మేయర్ డాక్టర్ తక్కెళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డుపై ఇసుక అడ్డా జంక్షన్ రాజశ్రీగార్డెన్‌లో శుక్రవారం జరగనున్న బీజేపీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలను గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కాశిబుగ్గ: బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేసి విజయవంతానికి సహకరించిన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను ఫోర్ట్‌రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి ఉత్సవ సమితి సభ్యులు సన్మానించారు.